తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT
THE LARGEST TELUGU DAILY NEWS PAPER
ఎడిటర్: బక్క రవీందర్ సంపుటి:1 . సంచిక 174 మంగళవారం,28-01-2025
Hyderabad · Rangareddy · Mahaboob Nagar · Medak · Karimnagar · Warangal · Khammam · Nalgonda. Adilabad. Nizamabad.

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రధాని మోదీ ఫోన్..

2లో.





వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసుల్లో రోజువారీ విచారణ చేపట్టాలని ట్రయల్ కోర్టు(సీబీఐ ప్రత్యేక కోర్టు)ను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేసుల విచారణ తీరును పర్యవేక్షించాలని తెలంగాణ హైకోర్టుకు సూచించింది.

2లో.

### మహా కుంభమేళాకు పోటెత్తిన భక్తజనం

మహా కుంభమేళాకు జనాలు పెద్ద ఎత్తున తరలివెళ్తున్నారు. ఈ క్రమంలో రేపు జనవరి 29న (రెండవ షాహి స్నాన్) మౌని అమావాస్య సందర్భంగా రెండు కోట్ల మందికిపైగా వచ్చే అవకాశం ఉందని అక్కడి అధికారులు అంచనా వేస్తున్నారు డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:



### ఫోన్ ట్యాపింగ్ కేసు.. తిరుపతన్నకు బెయిల్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పాత్రధారిగా అభియోగాలున్న మేకల తిరుపతన్నకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. సుమారు 10 నెలల తర్వాత సర్వోన్నత న్యాయస్థానం అతడికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:



### మహిళలకు ప్రతినెలా రూ. 2,100

కేజ్రీవాల్ కా గ్యారెంటీ'' పేరుతో రూపొందించిన ఎన్నికల మ్యానిఫెస్టోను ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ సోమవారం విడుదల చేశారు.

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:



### ఉత్తరాఖండ్‌లో అమల్లోకి యూసీసీ

ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) విధానం అమలులోకి వచ్చింది. దేశంలోనే యూసీసీని అమలుచేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచింది.

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:



## ప్రధాన వార్తలు

### గంగలో మునిగితే పేదరికం పోతుందా: ఖర్గే



గంగానదిలో మునిగితే పేదరికం పోతుందా అని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ప్రశ్నించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా మహూ(అంబేడ్కర్ జన్మస్థలం)లో కాంగ్రెస్ 'జై బాపూ, జైభీమ్, జై సంవిధాన్' ర్యాలీ నిర్వహించింది. ఖర్గేతో పాటు ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ, ఇతర సీనియర్ నేతలు హాజరయ్యారు. ఖర్గే ప్రసంగిస్తూ.. తాను ఎవరి విశ్వాసాన్నీ ప్రశ్నించడం లేదన్నారు. తన మాటలకు ఎవరైనా బాధపడితే క్షమాపణ కూడా చెబుతున్నట్లు తెలిపారు.

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:


### మహాకుంభమేళా.. సనాతన సంస్కృతికి ఐక్యతా చిహ్నం!



సనాతన సంస్కృతి, జీవన తత్వానికి మహాకుంభమేళా ఐక్యతా చిహ్నమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. సామరస్యమే సనాతన సంస్కృతికి జీవనాడిగా పేర్కొన్నారు. మహాకుంభమేళాలో సోమవారం ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:

### కైలాస్ మానస సరోవర్ యాత్ర పునరుద్ధరణ..



2020 నుంచి నిలిచిపోయిన 'కైలాస్ మానస సరోవర్ యాత్ర' ను పునరుద్ధరించాలని ఇండియా- చైనా నిర్ణయించాయి. ఇరుదేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు పునరుద్ధరించేందుకు కూడా సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చాయి.

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:

### మహారాష్ట్ర అభివృద్ధిలో తెలుగు ప్రజల పాత్ర: గవర్నర్




మహారాష్ట్ర అభివృద్ధిలో తెలుగు ప్రజల పాత్ర ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.మరాఠి,తెలుగు సాంస్కృతిక బంధం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:

# రైతుల ఖాతాల్లో నగదు జమ.. 4.41 లక్షల మందికి 569 కోట్ల సాయం

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:

రైతు భరోసా పథకం నిధులు ఆదివారం (ఈ నెల 26) అర్ధరాత్రి నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో టకీ టకీమని పడతాయంటూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగానే సోమవారం ఆయా రైతులకు నగదు జమ అయింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ పథకం కింద 561 మండలాల్లోని 577 గ్రామాలకు చెందిన 4,41,911 మందికి పెట్టుబడి సాయం అందింది. మొత్తం 9,48,333 ఎకరాలకు సంబంధించి రూ.569 కోట్లు ఖాతాల్లో జమయ్యాయి. వీరితోపాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు కూడా సాయం అందింది. మొదటి విడతగా తొలి రోజు 18,180 మంది వ్యవసాయ కూలీల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున జమ చేశారు. ఈ రెండు పథకాలకు కలిపి రూ.579 కోట్లను ఆర్థికశాఖ విడుదల చేసింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఆదివారం ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు శ్రీకారం చుట్టిన రేవంత్ సర్కారు.. వీటి ద్వారా తొలిరోజు మొత్తం 6,15,677 మంది అర్హులకు లబ్ధి చేకూర్చింది. ఆయా గ్రామాల్లోని రైతులకు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతోపాటు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు కార్డులు జారీ చేశారు. ఇల్లు లేని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. 26న బ్యాంకులకు సెలవు కావడంతో సోమవారం ఉదయం నుంచి ఈ నిధులు రైతుల ఖాతాల్లోకి చేరాయి.






- రైతు కూలీలకు రూ.10 కోట్ల ఆత్మీయ భరోసా
- ఒకే రోజ నాలుగు పథకాల అమలు ప్రారంభం
- 561 మండలాల్లో 577 గ్రామాల్లో లబ్దిదారులు
- 15,414 కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డుల జారీ
- పాత కార్డుల్లో అదనంగా 1.03 లక్షల మంది చేర్పు
- 72 వేల మందికి ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు
- ఇండ్ల కోసం 80.50 లక్షల మంది దరఖాస్తులు
- ఇప్పటికే 40 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తి
- ఇళ్ల స్థలాలున్న వారు 21.30 లక్షల మంది
- స్థలాలు లేనివారు 18.7 లక్షల మందిగా నిర్ధారణ!
- వారంలో పూర్తి కానున్న పరిశీలన ప్రక్రియ
- ఎన్నికల హామీలను అమలు చేస్తున్నాం: తుమ్మల
- అచ్చంపేట మార్కెట్ కమిటీ ఘటనపై మంత్రి ఆరా

# కాంగ్రెసులో.. ఎమ్మెల్సీ ఎన్నికల వేడి

- మార్చి 29న ఖాళీ కానున్న ఎనిమిది సీట్లు
- పట్టభద్రుల స్థానంలో జీవన్‌రెడ్డి పోటీపై అస్పష్టత
- ఎమ్మెల్యే కోటాలో ఎంపిక చేసే అంశంపై పరిశీలన
- జీవన్‌రెడ్డినే పోటీకి దింపాలని అధిష్ఠానం సూచన
- రేసులో మన్ను రమణారెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు
- 5 ఎమ్మెల్యే కోటా సీట్లలో కాంగ్రెస్‌కు 3 దక్కే చాన్స్



డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:

కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీ ఎన్నికల వేడి రాజుకుంది. వచ్చే మార్చి నెలలో 8 సీట్లు ఖాళీ కానున్న నేపథ్యంలో టికెట్లు దక్కించుకోవడానికి ఆశావహులు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పార్టీ అధిష్ఠానం, ముఖ్య నాయకుల ప్రసన్నం కోసం చక్కర్లు కొడుతున్నారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటుతోపాటు కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీల పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. అలాగే ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఒక ఎంఐఎం ఎమ్మెల్సీపదవీ కాలమూ ఆ రోజుతోనే పూర్తి కానుంది. వీటిలో నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటుకు జరిగే ఎన్నికను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ఉత్తర తెలంగాణ పట్టభద్రుల తీర్పు... ప్రభుత్వ పని తీరుకు గీటురాయిలా ప్రతిబింబిస్తుందని అంచనా వేస్తోంది. కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి ప్రస్తుతం జీవన్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారడం, ఖర్చుతో కూడుకున్నది కావడంతో జీవన్‌రెడ్డికి బదులుగా వేరొకరిని ఎంపిక చేయాలన్న ఆలోచనలో తెలంగాణ కాంగ్రెస్ ఉంది. జీవన్‌రెడ్డిని ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా పంపాలన్న చర్చ నడుస్తోంది.